# సినీ ప్రపంచంలో సాహితీ మూర్తి

నారాయణరెడ్డి.



ఒక సినీ గేయ రచయితకి భారతదేశ సాహిత్య ప్రపంచంలో అత్యున్నతమైన, ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ్ అవార్డ్ దక్కడమా?
అదీ డిగ్రీ వరకూ ఉర్దూ మాధ్యమంలో చదివి, తెలుగు సాహిత్యంతో స్నాతకోత్తర పట్టా సాధించడమే కాకుండా సాహితీ శిఖరారోహణం చేయడం సాధారణమైన విషయమా? కానేకాదు.
నమ్మశక్యంకాని ఆ ఘనత సాధించిన తెలుగు కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి. 1931వ తేదీ జులై 29న జన్మించిన నారాయణరెడ్డికి ముందుగా జన్మదినోత్సవ శుభాకాంక్షలు.
తెలుగు సినిమారంగంలోకి ఎందరో పండితులు అడుగుపెట్టి ఉండొచ్చు. వారందరికంటే విభిన్నమైన వ్యక్తిత్వం డాక్టర్ నారాయణరెడ్డిది.
కరీంనగర్‌జిల్లాలోని హనుమాజీపేట అనే మారుమూల గ్రామంలో జన్మించిన నారాయణరెడ్డి పాఠశాల విద్య అదే గ్రామంలోనూ, సమీపంలోని సిరిసిల్ల పట్టణంలోనూ జరిగింది. తర్వాత హైదరాబాద్‌కు మకాం మారింది. ఇంటర్, ఆ తర్వాత విద్యాభ్యాసమంతా హైదరాబాద్‌లో సాగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ , ఎం.ఎ, పిహెచ్.డి చేశారు.
పదకొండవఏటనే వివాహం జరిగినా అది ఆయన విద్యాభ్యాసానికి ఆటంకం కాలేదు.
ప్రకృతిని ప్రేమిస్తారేమో నారాయణరెడ్డి, అందుకే తన సంతానానికి నదీమతల్లుల పేర్లే పెట్టుకున్నారు- గంగా, యమున, సరస్వతి, కృష్ణవేణి అని.సికింద్రాబాద్ కాలేజీలోనూ తర్వాత నిజాం కాలేజీలో అధ్యాపకుడిగా, ఉస్మానియా, ఆర్ట్స్ కాలేజీలో రీడర్‌గా ప్రొఫెసర్‌గా పనిచేశారు నారాయణరెడ్డి. నారాయణరెడ్డి రచనలలో ముద్రితమైనవి 75 పుస్తకాలు.

1961లో గులేబకావళి కథ చిత్రంలోని "నన్ను దోచుకొందువటే" అనే పాటతో సినీ పరిశ్రమలోకి గేయరచయితగా అడుగుపెట్టారు. అది ఎన్టీఆర్ సొంత సినిమా. ఎన్టీఆర్ స్వయంగా అభ్యర్థిస్తేనే సినిమారంగంలోకి వచ్చారాయన. ఆ పాట ఎంత హిట్ అన్నదీ ఈనాటి వారికీ తెలుసు. గులేబకావళి కథ సినిమా నుంచీ ఎన్టీఆర్‌తో ప్రారంభమైన స్నేహం చిరకాలం కొనసాగింది. ఎన్టీఆర్ అభిమాన రచయితలలో నారాయణరెడ్డి ఒకరు. తల్లాపెళ్ళామా చిత్రానికి ఆయన రచించిన "తెలుగు జాతి మనది" పాట తెలుగువారందరూ ఎప్పటికీ గుర్తుంచుకోదగినది. ఆ పాటలో ఆయనిచ్చిన సందేశం మర్చిపోరానిది.

ఏకవీర సినిమా కోసం సంభాషణలు కూడా సమకూర్చారు నారాయణరెడ్డి. సుమారు మూడువేల గీతాలు సినిమాల కోసం ఆయన రాశారు. అధికార భాషాసంఘం అధ్యక్షులుగా, అంబేద్కర్, తెలుగు విశ్వవిద్యాలయాలకు వైస్-చాన్సలర్‌గా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షునిగా, రాజ్యసభ సభ్యునిగా, రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక, భాషా సలహాదారుగా వ్యవహరించారు.
1977వ సంవత్సరంలో పద్మశ్రీ, 1998లో జ్ఞానపీఠ్, ఆ మరుసటి ఏడాదే పద్మభూషణ్ అవార్డులు ప్రభుత్వం నుంచి పొందారు. మీరట్, ఆంధ్రా, నాగార్జున, కాకతీయ, అంబేద్కర్ విశ్వవిద్యాలయాల నుంచి డాక్టర్ నారాయణరెడ్డి గౌరవ డాక్టరేట్ డిగ్రీలు పొందారు. నారాయణరెడ్డికి కీర్తి ప్రతిష్ఠలు పెంచిన రచనలలో ప్రముఖంగా చెప్పుకోవలసింది గజల్స్. ఆయన రాసిన గజల్స్ సరళంగా ఉంటాయి.
సినీగీతాలతో బహువిధ చమత్కారాలు చేసిన ఈ సాహితీవేత్తకు తెలుగువన్ మరోసారి చెబుతోంది జన్మదిన శుభాకాంక్షలు.